
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



5

జనగామ

మంగళవారం 13 ఆగస్టు 2024



శాయంపేట ఎంజేపీ పాఠశాలలో కిచెన్ పక్కనే వ్యర్థ పదార్థాలు



జనగామ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో తలుపులులేని మరుగుదొడ్లు

ఆంధ్రజ్యోతి ఫోకస్

అస్తవ్యస్త గురుకులాలు

- ఉమ్మడి వరంగల్ జిల్లాలో అధ్వానంగా పాఠశాలలు
- అద్దె భవనాలు, అరకొర వసతులతో సతమతం
- విద్యార్థులకు కానరాని కనీస సౌకర్యాలు
- చాలినన్ని మరుగుదొడ్లు లేక ఇబ్బందులు
- నాసిరకం భోజనంతో కడుపు మాడ్చుకుంటున్న వైనం
- ప్రహరీ లేక పురుగుల బారిన పడి రోగాలపాలు
- పేద విద్యార్థుల విద్యపై సర్కారు అశ్రద్ధ

ఉమ్మడి వరంగల్ జిల్లాలో గురుకుల పాఠశాల పరిస్థితి అత్యంత అధ్వానంగా ఉంది. కనీస సౌకర్యాలు మచ్చుకైనా కానరావడం లేదు. పేద విద్యార్థులు అధికంగా చదువుకునే ఈ గురుకులాలపై ప్రభుత్వం అంతగా శ్రద్ధపెట్టడం లేదు. కొన్ని సొంత భవనాల్లో నడుస్తుండగా, మరికొన్ని అద్దె భవనాల్లో అరకొర వసతుల మధ్య కూనారిల్లుతున్నాయి. తాగునీటి వసతి లేదు. మరుగుదొడ్లు చాలినన్ని లేవు. ఉన్నవాటికి తలుపులు సరిగా లేవు. కొన్నిటికీ అసలు తలుపులే లేవు. పరిశుభ్రత కానరావడం లేదు. పాఠశాలల ఆవరణలో పిచ్చిమొక్కలు దట్టంగా పెరిగి చిట్టడివిని తలపింపచేస్తున్నాయి. ఏజెన్సీ ప్రాంతాల్లో గురుకుల పాఠశాలల చుట్టూ ప్రహరీగోడలు లేక విద్యార్థులు విషపురుగుల కాటుకు గురవుతున్నారు. భోజనం నాణ్యతగా ఉండడం లేదు. కలుషిత ఆహారంవల్ల విద్యార్థులు తరుచూ అస్వస్థతకు గురవుతున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో గురుకుల పాఠశాలల దుస్థితిపై రౌండప్

హనుమకొండ, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి):


ఉమ్మడి వరంగల్ జిల్లాలో అనేక గురుకులాలు అరకొర వసతులతో అవస్థలు పడుతున్నాయి. చాలా గురుకులాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. వాటిలో సరైన సౌకర్యాలు లేవు. ప్రహరీగోడలు, సరిపడా మరుగుదొడ్లు, స్నానపు గదులు లేకపోవడంతో విద్యార్థులు నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొత్తగా నిర్మించిన గురుకుల భవనాలకు ప్రహరీలు నిర్మించడంపై శ్రద్ధ చూపించడం లేదు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారం, ఉన్నత విద్యను అందించడానికి ఈ గురుకులాలను ఏర్పాటు చేయగా ఆ లక్ష్యం నెరవేరడం లేదు. మెనూ ప్రకారం ఎక్కడా భోజనం వడ్డించడం లేదు. గురుకులాల్లో రోజూ ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం, రాత్రి డిన్నర్‌లో బలవర్ధకమైన ఆహారం అందించాలి. కానీ ఎక్కడా అమలు కావడం లేదు. వారానికి నాలుగు రోజులు గుడ్లు, ఒక రోజు చికెన్, నెలకొకసారి రెండోవారం మటన్ వడ్డించాలి. కూరగాయలు కూడా నాణ్యమైనవి అందించాలి. ఉదయం టిఫిన్ సమయంలో బూస్ట్ కలిపిన పాలు అందించాలి. కానీ ఎక్కడా ఆ విధంగా చేయడం లేదు. మధ్యాహ్నం భోజనంలో ఒక కర్రీ, సాంబార్, పప్పు మాత్రమే అందిస్తున్నారు. అది కూడా ఏ మాత్రం నాణ్యత లేకపోవడంతో విద్యార్థులు అర్ధాకలితో ఇబ్బందులు పడుతున్నారు. టిఫిన్ కూడా రోజూ ఒక రకం పెట్టాలి. కానీ ఏది తక్కువ ధర ఉంటుందో వాటినే అందిస్తున్నారు. వంట సరిగా చేయనివారిని మార్చాలని సూచిస్తున్నప్పటికీ ప్రిన్సిపాళ్ల దయతో వారినే కొనసాగిస్తున్నారు. కొన్ని గురుకులాల్లో పాడైన కూరగాయలు, మధ్యాహ్నం మిగిలిన పప్పుతో రాత్రికి సాంబార్ చేస్తున్నారని సమాచారం. నిల్వ ఉంచిన కూరలు తిని విద్యార్థులు తరుచూ అస్వస్థతకు గురవుతున్నారు.

హనుమకొండ జిల్లా

హనుమకొండ జిల్లాలో 22 గురుకుల పాఠశాలలు ఉన్నాయి. హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలంలోని కస్తూర్బా పాఠశాల, కళాశాలలో విద్యార్థులకు సరిపడా మరుగుదొడ్లు లేరు 450మంది విద్యార్థులకు పది మరుగుదొడ్లే ఉన్నాయి. కొత్త భవనం నిర్మాణంలో ఉన్నది. ఎల్కతుర్తి మండలంలోని కస్తూర్బా పాఠశాలలో డార్మెట్రీలు లేవు. చాలినన్ని గదులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. భవనం ఫ్లోరింగ్ దెబ్బతిన్నది. పాఠశాల పక్కనే అడవి ఉండడంతో పాములు, తేళ్ల లోపలికి వస్తున్నాయి. శాయంపేట మండల కేంద్రంలోని ఎంజేపీ బాలుర పాఠశాల కిచెన్ పక్కనే వ్యర్థపదార్థాలను పారవేస్తుండడంతో కుళ్లి కంపుకొడుతోంది. ఆత్మకూరు మండల కేంద్రంలోని ఎంజేపీ పాఠశాల ప్రైవేటు భవనంలో కొనసాగుతోంది. కనీస వసతుల్లేవు. భవనానికి కిటికీలు లేవు. తాగునీటి సౌకర్యం సరిగా లేదు. కోతుల బెడద అధికంగా ఉంది. ఈ పాఠశాలకు గ్రౌండ్ లేదు.



ఫ్యాన్లు లేని నిద్రించే గది



అశోక్‌నగర్ కస్తూర్బా పాఠశాలలో పనిచేయని సోలార్ వాటర్ హీటర్

పరిసరాలు పరిశుభ్రంగా లేక దోమలు స్వైర్యవిహారం చేస్తున్నాయి. పాఠశాల నూతన భవనం అసంపూర్తిగా ఉంది.

వరంగల్ జిల్లా

వరంగల్ జిల్లాలో అన్ని రకాల గురుకులాలు కలిపి 26 ఉన్నాయి. ఖానాపురం మండలంలోని అశోక్‌నగర్ గిరిజన సైనిక పాఠశాలలో పాఠశాల ఆవరణలో అంతర్గతంగా సీసీ రోడ్లు లేకపోవడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలంలో డైనింగ్ హాల్‌కు వెళ్లడానికి విద్యార్థులు బురదలో నడుచుకుంటూ వెళ్తున్నారు. పాఠశాల చుట్టూ పూర్తిస్థాయిలో ప్రహరీగోడ లేకపోవడంతో విద్యార్థులకు రక్షణ కొరవడింది. 680మంది విద్యార్థులున్నా.. పాఠశాలలో జనరేటర్ సౌకర్యం లేకపోవడంతో రాత్రివేళలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడితే విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విద్యాసంవత్సరంలో విద్యార్థులకు యూనిఫామ్స్, దుప్పట్లు ఇప్పటి వరకు సరఫరా చేయలేదు. కస్తూర్బా గురుకుల పాఠశాలలో ఇంటర్మీడియట్ విద్యార్థులకు సరిపడా తరగతి గదులు, డార్మెటరీ లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాలలో సోలార్ వాటర్ హీటర్ పనిచేయకపోవడంతో విద్యార్థులు చన్నీళ్ల స్నానం చేస్తున్నారు. నర్సంపేట డివిజన్‌లో 26 బీసీ, ఎస్సీ, ఎస్టీ బాలికలు, బాలుర వసతిగృహాలు, గురుకులాలు, మోడల్ స్కూల్స్ ఉన్నాయి. ఇందులో ట్రైబల్ వెల్ఫేర్ హాస్టల్, ఎస్టీ కళాశాల హాస్టల్, ఎస్సీ, బీసీ, ఎస్టీ బాలికల కళాశాల హాస్టల్, ఎస్సీ బాలుర కళాశాల హాస్టల్, మైనారిటీ గురుకులం, మహేశ్వరంలోని అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్‌కు నల్లబెల్లి మండలం మూడుచెక్కలపల్లె ఆశ్రమ కళాశాల హాస్టల్, చెన్నారావుపేట, దుగ్గొండి మండలాలకు చెందిన సంక్షేమ హాస్టళ్లకు సొంత భవనాలు లేక నర్సంపేట పట్టణంలో అద్దె భవనాల్లో కొనసాగిస్తున్నారు. విద్యార్థుల సంఖ్యకు సరిపడా మరుగుదొడ్లు, స్నానపుగదులు లేకపోవడం విద్యార్థులు ఇబ్బందులు

మిగతా 7వ పేజీలో..



గదులు సరిపడా లేకపోవడంతో వరండాలోనే బెడ్లను ఏర్పాటు చేసిన దృశ్యం

గురుకులాలు

ఉమ్మడి వరంగల్ జిల్లాలో వందకు పైగా గురుకులాలు ఉన్నాయి. తెలంగాణ రాష్ట్ర గురుకుల విద్యాలయాలు (టీఎస్ఆర్ఈఐ), తెలంగాణ రాష్ట్ర సాంఘిక సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు (టీఎస్ఎస్ డబ్ల్యుఆర్ఈఐ), తెలంగాణ రాష్ట్ర గిరిజన ఆశ్రమ పాఠశాలలు (టీఎస్‌టీడబ్ల్యుఆర్ఈఐ), గిరిజన ఆశ్రమ పాఠశాలలు (టీడబ్ల్యు ఆశ్రమ) మహాత్మాజ్యోతిబాఫూలే విద్యాలయాలు (ఎంజేపీఐ), మైనారిటీ సంక్షేమ గురుకుల పాఠశాలలు (ఎండబ్ల్యుఆర్ఐ) కస్తూర్బా గురుకుల పాఠశాలలు (కేఆర్ఐ) వీటిలో ఉన్నాయి. హనుమకొండ జిల్లాలో 22, వరంగల్ జిల్లాలో 26, ములుగు జిల్లాలో 9, మహబూబాబాద్ జిల్లాలో 39, జనగామ జిల్లాలో 16, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 6 గురుకుల పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 52వేల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు.



బందారుపల్లి గురుకులంలో నీటి కష్టాలు

ప్రజావాణి దరఖాస్తులను పరిష్కరించాలి

కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా



ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న అర్జీదారులు

జనగామ రూరల్, ఆగస్టు 12: ప్రజావాణిలో వచ్చే దరఖాస్తుల పట్ల నిర్లక్ష్యం వహించకుండా వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్, ఆర్డీవోలు వెంకన్న, కొమురయ్య పాల్గొని ప్రజల నుంచి మొత్తం 84 అర్జీలను స్వీకరించారు. ప్రజల నుంచి స్వీకరించిన దరఖాస్తుల పరిష్కారం కోసం అన్ని మండలాల తహసీల్దార్లకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఫిర్యాదుల పట్ల ఎలాంటి అలసత్వం వహించవద్దని, సమస్యలు పెండింగ్‌లో లేకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుహాసిని, డీఆర్‌డీవో వసంత, డీఈవో రాము, డీఎస్‌వో రోజారాణి, డీడబ్ల్యూవో జయంతి, డీఏవో వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. కాగా, తన కుమారుడు వెంకటేశ్వర్లు 2023, ఆగస్టు 18న మండలంలోని కోఆపరేటివ్ బ్యాంకులో భూమి పాసుబుక్కు పెట్టి రూ.92వేలు క్రాప్ లోన్ తీసుకోగా రుణమాఫీ కాలేదని పాలకుర్తి మండలం చెన్నూరు గ్రామానికి చెందిన కారుపోతుల చిన్నసోమయ్య ప్రజావాణిలో విన్నవించారు. ఏవోను అడిగినప్పటికీ సరైన సమాధానం చెప్పడం లేదని, మాకు రుణమాఫీ అయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.

చోరీలకు పాల్పడుతున్న ముగ్గురి అరెస్టు

వివరాలు వెల్లడించిన డీసీపీ రాజమహేంద్ర నాయక్



నిందితుల అరెస్టు చూపి వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ

జనగామ రూరల్, ఆగస్టు 12: జల్సాలకు అలవాటు పడి దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురు యువకులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీసీపీ రాజమహేంద్ర నాయక్ తెలిపారు. జనగామ పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుల అరెస్టు చూపి వివరాలను వెల్లడించారు. హైదరాబాద్‌లోని సింగరేణి కాలనీలో నివసిస్తున్న చుకటాల కుమార్, బురుగు యాదగిరి, తలతోటి ప్రవీణ్‌లు జల్సాలకు అలవాటు పడి సులభంగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశ్యంతో రాత్రి పూట జనగామ పోలీస్ స్టేషన్ పరిధిలో దొంగతనాలకు పాల్పడుతున్నారని తెలిపారు. ఈ క్రమంలో జనగామ పోలీసులు వాహనాల తనిఖీలు చేస్తుండగా పారిపోవడానికి ప్రయత్నించగా ముగ్గురిని పట్టుకొని 7.3 తులాల బంగారం, 64 తులాల వెండి మొత్తం రూ.5,74,320 విలువ గల సొమ్మును స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. కుమార్‌పై గతంలో హైదరాబాద్‌లోని పలు పోలీస్ స్టేషన్లలో 14 దొంగతనం కేసులు, యాదగిరిపై ఒక్క కేసు నమోదు అయిందన్నారు. కాగా, నిందితులను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన సీఐ పి.దామోదర్‌రెడ్డి, ఎస్సై భరత్, ఏఎస్సై జి.శంకర్, కానిస్టేబుళ్లు టి.రామన్న, కె.అనిల్‌కుమార్, ఐ.సురేష్‌లను వరంగల్ సీపీ అంబర్ కిషోర్ ఝా అభినందించారని డీసీపీ రాజమహేంద్ర నాయక్ తెలిపారు.

ధరణిలో అన్నీ లొసుగులే..

- ఇబ్బందులు పడుతున్న లక్షలాది రైతులు
- కాంగ్రెస్ కిసాన్ సెల్ జాతీయ ఉపాధ్యక్షుడు కోదండరెడ్డి

బచ్చన్నపేట, ఆగస్టు 12: పటిష్టంగా ఉన్న రెవెన్యూ చట్టాలను మార్చేందుకు కేసీఆర్ ప్రభుత్వం ధరణి పేరుతో అనేక లోపాలున్న చట్టంను తీసుకువచ్చి లక్షలాది మంది రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేసిందని కాంగ్రెస్ కిసాన్ సెల్ జాతీయ ఉపాధ్యక్షుడు, ధరణి కమిటీ సభ్యుడు ఎం.కోదండరెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుని పటిష్టమైన 2024-ఆర్వోఆర్ చట్టం తీసుకువస్తోందని తెలిపారు. సోమవారం మండలంలోని బండనాగారం, సిద్దిపేట జిల్లా మద్దూరు మండలం బంజర గ్రామ రైతులకు సంబంధించిన పెండింగ్ భూ సమస్యలను స్వయంగా పరిశీలించేందుకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం భూముల రికార్డుల ప్రక్షాళన కార్యక్రమం 2017లో చేపట్టి ఆధారాలున్న వాటిని పార్ట్-ఏ పేరుతో హడావిడిగా చేసి, పార్ట్-బీలో 22లక్షల ఎకరాల భూమిని పెట్టినట్టు ఆరోపించారు. ఇది నిషేధిత జాబితాగా తయారు చేశారన్నారు. ఇవిగాక చట్టబద్ధత లేని అనేక లక్షల ఎకరాల భూ సమస్య అలాగే ఉందన్నారు. తాము అధికారంలోకి రాక ముందే ధరణి పేరుతో తీసుకువచ్చిన చట్టంలో అనేక లొసుగులున్నాయని పార్టీలో కాంగ్రెస్ నేతగా ఉన్న రేవంత్‌రెడ్డి ఓ కమిటీ వేసి అనేక ప్రాంతాల్లో పర్యటింపజేసి వివరాలు తెప్పించుకున్నారని తెలిపారు. అనేక లోపాలు గుర్తించడంతో ఎన్నికల మేనిఫెస్టోలో ధరణిని రద్దు చేస్తామనే హామీని చేర్చామన్నారు. తాము అధికారం చేపట్టే నాటికి 2.46 లక్షల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. తర్వాత 60వేల దరఖాస్తులు కొత్తగా వచ్చాయని చెప్పారు. స్పెషల్ డ్రైవ్ ద్వారా 2లక్షల దరఖాస్తులను పరిష్కరించామని మరో లక్షతో పాటు పార్ట్-బీ దరఖాస్తులు ఉన్నాయన్నారు. వీటన్నింటిని పరిష్కరించడం కోసం కొత్త చట్టం తప్పనిసరని భావించి అన్ని పార్టీలకు సలహాల కోసం సమాచారం ఇచ్చామన్నారు. బీఆర్ఎస్, బీజేపీ సమావేశానికి గైర్హాజరయ్యాయన్నారు. అయినప్పటికి ఈనెల 23 వరకు తమ అభిప్రాయాలను లిఖిత పూర్వకంగా తెలియజేయాలని సూచించారు.



మాట్లాడుతున్న కాంగ్రెస్ కిసాన్ సెల్ జాతీయ ఉపాధ్యక్షుడు కోదండరెడ్డి

ఇళ్ల స్థలాలిప్పించాలని జర్నలిస్టుల వినతి

25ఏళ్లుగా పాత్రికేయ వృత్తిలో కొనసాగుతున్నా ఇప్పటి వరకు ఇళ్ల స్థలాలు ప్రభుత్వం నుంచి పొందలేదని బచ్చన్నపేటకు చెందిన విలేకరుల బృందం జాతీయ కాంగ్రెస్ కిసాన్ సెల్ ఉపాధ్యక్షుడు కోదండరెడ్డికి సోమవారం వినతిపత్రం అందించారు. అనేక మార్లు దరఖాస్తులు చేశామని, సీసీఎల్ఏ ఆమోదం పొందినప్పటికి తమకు ఇళ్ల స్థలాల కోసం ఎలాంటి మంజూరు రాలేదని ఆయన దృష్టికి తీసుకెళ్లగా రాష్ట్ర స్థాయి అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. సత్వరం సమస్య పరిష్కారం అయ్యేలా చూస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ గౌరవ అధ్యక్షుడు ముసిని వీరాగౌడ్, అధ్యక్షుడు తేలుకంటి మురళి, ప్రధాన కార్యదర్శి మేకల శ్రీనివాస్‌రెడ్డి, జంగిలి భిక్షపతి, రెడ్డబోయిన హరికుమార్, గర్నేపల్లి కర్నాకర్, సందెల బాలసిద్దులు, కోనేటి స్వామి, పంబాల మల్లేశం, భాస్కర్ పాల్గొన్నారు.

గోదావరిలో నీళ్లున్నా ప్రభుత్వ నిర్లక్ష్యం

ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

62 మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ



బచ్చన్నపేటలో లబ్ధిదారులకు చెక్కులు అందజేసిన ఎమ్మెల్యే రాజేశ్వర్‌రెడ్డి

బచ్చన్నపేట, ఆగస్టు 12: గోదావరి నదిలో నీళ్లున్నా ఎత్తిపోసి చెరువులను నింపేందుకు ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి విమర్శించారు. సోమవారం బచ్చన్నపేట మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో 62 మంది లబ్ధిదారులకు రూ.17,11,500 విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో కళకళలాడిన చెరువులు, కుంటలు ప్రస్తుతం నీళ్లలేక వెలవెల బోతున్నాయన్నారు. అసెంబ్లీలో పలుమార్లు రైతుల సమస్యలపై మాట్లాడటం జరిగిందన్నారు. పదేళ్లుగా ఎండని గుడి చెరువు నీరులేక అడుగంటిందని తెలిపారు. గోదావరి జలాలతో చెరువులు నింపకపోతే పంటలు చేతికి రావడం కష్టమన్నారు. అనేక మార్లు చేసిన పోరాటాల ఫలితంగా మూడు మోటార్లు ఆన్ చేశారని చెప్పారు. ప్రజలందరికి తండ్రి లాగా ఉండాల్సిందిపోయి, ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తోందన్నారు. కేసీఆర్ ప్రాజెక్టు కట్టించడమే పాపమన్నట్టు ప్రభుత్వం చెరువులను నింపకుండా తాత్సారం చేస్తోందన్నారు. రైతుబంధును ఇప్పటి వరకు వేయలేదన్నారు. రుణమాఫీ సైతం అరకొర చేసి చేతులు దులుపుకుంటున్నారని పేర్కొన్నారు. దీన్ని ఎట్టి పరిస్థితుల్లో సహించేది లేదన్నారు. తమకు చెందిన నీలిమా ఆస్పత్రికి నియోజకవర్గానికి చెందిన ఎంత మంది వైద్యం కోసం వచ్చినా ఉచితంగా అందించేందుకు సిద్ధమన్నారు. కార్యక్రమంలో రైతుబంధు సమితి జిల్లా మాజీ కోఆర్డినేటర్ ఇర్రి రమణారెడ్డి, మండల, పట్టణ అధ్యక్షులు బోడిగం చంద్రారెడ్డి, గంధమాల నరేందర్, పీఏసీఎస్ చైర్మన్ పులిగిళ్ల పూర్ణచందర్, వైస్ చైర్మన్ మద్దికుంట రాధ, మాజీ ఎంపీపీ బావండ్ల కృష్ణంరాజు, కల్లూరి అనిల్‌రెడ్డి, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

ఇరువురు మావోయిస్టుల లొంగుబాటు

వివరాలు వెల్లడించిన ములుగు ఎస్పీ

ములుగు, ఆగస్టు 12: సీపీఐ(ఎంఎల్) మావోయిస్టు పార్టీకి చెందిన ఇద్దరు దళసభ్యులు సోమవారం ములుగు జిల్లా ఎస్పీ శబరీశ్ ఎదుట లొంగిపోయారు. ఒడిశా రాష్ట్రానికి చెందిన మాజీ మావోయిస్టు అన్నెం చందర్‌రావు అనే వ్యక్తితో ఫేస్‌బుక్‌లో ఏర్పడ్డ పరిచయం ద్వారా అజ్ఞాతంలోకి వెళ్లినట్లు ఎస్పీ తెలిపారు. ఇందుకు

మిగతా 8వ పేజీలో...



లొంగిపోయిన మావోయిస్టులతో ఎస్పీ, ఓఎస్డీ, డీఎస్పీ

రుణమాఫీ లబ్ధిదారులకు కొత్త రుణాలు ఇవ్వండి..

టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు

హనుమకొండ సిటీ, ఆగస్టు 12: రుణమాఫీ పొందిన లబ్ధిదారులకు నూతనంగా పంట రుణాలు కల్పించాలని డీసీసీ బ్యాంక్ మేనేజర్లను టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు ఆదేశించారు. సోమవారం హనుమకొండ నక్కలగుట్టలోని డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో మేనేజర్లతో ఆయన సమీక్ష జరిపారు. పీఏసీఎస్‌లను సందర్శించి రుణమాఫీ పొందిన రైతులకు వీలైనంత త్వరగా కొత్తగా రుణాల అర్హులను గుర్తించాలని సూచించారు. వర్షాకాల పంటల సాగుకు కొత్తగా మంజూరు చేసే రుణాలు ఉపయుక్తంగా ఉంటాయన్నారు. ఆధార్ కార్డులో తప్పుడు నమోదుల కారణంగా రుణమాఫీ పొందడంలో రైతులకు ఇబ్బందులు కలుగుతున్నట్లు పేర్కొన్నారు. దీనిని గుర్తించి వెంటనే పరిష్కార చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అర్హులైన రైతుల రుణాల వివరాలను ప్రభుత్వానికి సమర్పించడంలో అలసత్వం ప్రదర్శించిన పీఏసీఎస్ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని బ్యాంకు అధికారులను ఆదేశించారు. వ్యవసాయేతర పంట రుణాలు, డిపాజిట్లు తదితర అంశాలపై రవీందర్‌రావు సమీక్ష జరిపి బ్యాంక్ మేనేజర్లకు పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో సీఈవో వజీర్‌సుల్తాన్, డీజీఎం అశోక్, ఏజీఎంలు మధు, స్రవంతి, కృష్ణమోహన్, రాజుతో పాటు వివిధ శాఖల బ్యాంక్ మేనేజర్లు పాల్గొన్నారు.



బ్యాంక్ మేనేజర్ల సమావేశంలో మాట్లాడుతున్న టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు

సెల్ దొంగతనాలను అరికట్టడానికి పోర్టల్

వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా



ఫోన్ మహిళకు అందిస్తున్న సీపీ

వరంగల్ క్రైం, ఆగస్టు 12: సెల్‌ఫోన్ల దొంగతనాలను అరికట్టడానికి డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలీ కమ్యూనికేషన్ సీఇఐఆర్ పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకువచ్చిందని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. సోమవారం కమిషనరేట్‌లో సీసీఎస్ పోలీసులు సెల్‌ఫోన్ రికవరీ మేళాను నిర్వహించారు. రికవరీ చేసిన ఫోన్‌లను పోగొట్టుకున్న యజమానులకు సీపీ చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా అంబర్ కిషోర్ ఝా మాట్లాడుతూ.. దొంగతనం కాని, పోగొట్టుకున్న సెల్‌ఫోన్ల ఆచూకీ కోసం సీసీఎస్‌తో పాటు ప్రతీ స్టేషన్‌లో ప్రత్యేక విభాగం ఏర్పాటు చేశామన్నారు. కమిషనరేట్ పరిధిలో 7,022 సీఇఐఆర్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయగా ఇందులో 4,028 ఫోన్లను గుర్తించి 2527 స్వాధీనం చేసుకుని యజమానులకు అందించినట్లు తెలిపారు. వారంరోజుల్లోనే 150 ఫోన్లను సీసీఎస్ పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఎవరైనా ఫోన్ పోగొట్టుకుంటే పోర్టల్‌ను వినియోగించుకోవాలని సీపీ సూచించారు. ఈ కార్యక్రమంలో సీసీఎస్ సీఐ అబ్బయ్య, ఏఎస్ఐ గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

19 నుంచి కేయూ న్యాయశాస్త్ర సెమిస్టర్ పరీక్షలు

కేయూ క్యాంపస్, ఆగస్టు 12: కాకతీయ యూనివర్సిటీ న్యాయశాస్త్ర విభాగం మూడేళ్లు, ఐదేళ్ల కోర్సుల సెమిస్టర్ పరీక్షలు ఆగస్టు 19 నుంచి నిర్వహిస్తామని కేయూపరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ బి.నాగరాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. న్యాయశాస్త్రం మూడేళ్ల కోర్సుల్లో 4, 6వ సెమిస్టర్, న్యాయశాస్త్రం ఐదేళ్ల కోర్సుల్లో 8, 10వ సెమిస్టర్ పరీక్షలు మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతాయని వెల్లడించారు. ఇతర వివరాలకు కళాశాలలోనూ, వర్సిటీ వెబ్‌సైట్‌లోనూ సంప్రదించాలని వర్సిటీ పరీక్షల నియంత్రణాధికారులు తెలిపారు.

అలాగే ఎల్ఎల్‌బీ మూడేళ్ల 4వ సెమిస్టర్ పరీక్షలు ఆగస్టు 20, 22, 24,, 27, 29 తేదీల్లో, ఎల్ఎల్‌బీ మూడేళ్ల సెమిస్టర్ పరీక్షలు ఆగస్టు 19, 21, 23 తేదీల్లో, ఎల్ఎల్‌బీ ఐదేళ్ల 8వ సెమిస్టర్ పరీక్షలు ఆగస్టు 20, 22, 24, 27, 29 తేదీల్లో, ఎల్ఎల్‌బీ ఐదేళ్ల 10వ సెమిస్టర్ పరీక్షలు ఆగస్టు 19, 21, 23 తేదీల్లో జరుగుతాయని తెలిపారు.

వరంగల్ వస్త్రనగరికి కలిసి వచ్చేనా..?!

- దక్షిణ కొరియా పారిశ్రామిక వేత్తలకు సీఎం రేవంత్‌రెడ్డి ఆహ్వానం
- సీఎం పర్యటనతో మరిన్ని కొరియా కంపెనీలు వచ్చే చాన్స్





(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

వరంగల్ కాకతీయ టెక్స్‌టైల్ పార్కుపై ప్రభుత్వం దృష్టి పెట్టింది. భారీగా పెట్టుబడులను ఆహ్వానించి వరంగల్‌ను వస్త్రనగరిగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. జూన్ 29వ తేదీన సీఎం రేవంత్‌రెడ్డి టెక్స్‌టైల్ పార్కులో పర్యటించి పరిశ్రమలు రాకపోవడానికి గల కారణాలు తెలుసుకున్నారు. తన విదేశీ పర్యటనలో వరంగల్ టెక్స్‌టైల్‌పార్కులో పెట్టుబడుల కోసం దక్షిణ కొరియాలోని ప్రముఖ కంపెనీలతో సీఎం రేవంత్‌రెడ్డి రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహించారు. ఇప్పటికే గత ఏడాది కొరియాకు చెందిన యంగాన్ కంపెనీ ఎనమిది ఫ్యాక్టరీలను పెట్టేందుకు ఎంవోయూ కుదుర్చుకోగా, సీఎం పర్యటనతో మరిన్ని కొరియా కంపెనీలు మెగా టెక్స్‌టైల్ పార్కులో పెట్టుబడులకు ముందుకు వచ్చే అవకాశాలు ఉన్నాయనే చర్చ జరుగుతోంది.

సీఎం పర్యటనతో కలిసి వచ్చేనా..?

వరంగల్ జిల్లా గీసుకొండ మండలం శాయంపేట హవేలీలో 2017లో అప్పటి ప్రభుత్వం రూ.1,350కోట్ల వ్యయంతో 1,150 ఎకరాల్లో సుమారు 200లకు పైగా వస్త్ర కంపెనీలు, లక్ష మందికి ప్రత్యక్షంగా, మరో నాలుగు లక్షల మందికి పరోక్షంగా కేఎంటీపీ ద్వారా ఉపాధి కల్పించబోతున్నట్లుగా గత ప్రభుత్వం ఆశలు రేపింది. 22 కంపెనీలతో ఎంఓయూ చేసుకున్నప్పటికీ ఏడేళ్లలో కేవలం మూడు కంపెనీలు మాత్రమే అడుగు పెట్టాయి. ఇందులో 2021 జూలై 7వ తేదీన కైటెక్స్ సంస్థ ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుంది. కేరళకు చెందిన కైటెక్స్ రూ.1,200కోట్ల వ్యయంతో 187ఎకరాల్లో చిన్నపిల్లల దుస్తుల తయారీ యూనిట్‌ను నెలకొల్పింది. అలాగే గణేషా ఎకోపెట్, ఎకోటెక్ కంపెనీలు రూ.588కోట్ల వ్యయంతో సుమారు 50 ఎకరాల్లో రెండు యూనిట్లను ప్రారంభించింది. వాడి పడేసిన ప్లాస్టిక్ బాటిళ్లను సేకరించి రీసైక్లింగ్ చేస్తున్నారు. వీటితో దారాలను తయారు చేస్తుండగా, మరో యూనిట్ బాటిల్ తయారీకి ముడి సరుకును అందిస్తుంది. ప్రస్తుతం ఈ రెండు కంపెనీలే ఇక్కడ ఉత్పత్తి చేపట్టాయి. గత ఏడాది దక్షిణ కొరియాకు చెందిన యంగాన్ కంపెనీ 8 ఫ్యాక్టరీలను ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చింది. 2023లో గత ప్రభుత్వంతో యంగాన్ కంపెనీ ఒప్పందం చేసుకుంది. అయితే ఇప్పటి వరకు ఆశించిన స్థాయిలో పనులు ఇంకా పూర్తి కాలేదు. దీంతో జూన్ 29న వరంగల్ పర్యటనలో సీఎం రేవంత్‌రెడ్డి కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కును సందర్శించారు. పరిశ్రమలు రాకపోవడానికి గల కారణాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ నేపథ్యంలో టెక్స్‌టైల్ రంగానికి అధిక ప్రాధాన్యత ఇచ్చే దక్షిణ కొరియా దేశంపై ఫోకస్ పెట్టిన సీఎం రేవంత్‌రెడ్డి తన విదేశీ పర్యటనలో భాగంగా ఆ దేశాన్ని సందర్శించారు. ఇప్పటికే కాకతీయ టెక్స్‌టైల్ పార్కులో పెట్టుబడులు పెట్టిన యంగాన్ కంపెనీ, కొరియా ఫెడరేషన్ ఆఫ్ టెక్స్‌టైల్ ఇండస్ట్రీతోపాటు మరో 25 అగ్రశ్రేణి కంపెనీలతో రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించి పెట్టుబడులకు ఆహ్వానించటంతో వరంగల్‌లో వస్త్రనగరి భవిష్యత్తుపై ఆశలు చిగురిస్తున్నాయి. ఆశించిన స్థాయిలో కంపెనీలు మెగా టెక్స్‌టైల్ పార్కులో పెట్టుబడులు పెడితే వరంగల్ వస్త్రనగరిగా అభివృద్ధి చెందనుంది. అంతేకాకుండా సుమారు 2లక్షల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి, ఉద్యోగ అవకాశాలు రానున్నాయి. దీంతో సీఎం రేంవత్‌రెడ్డి కొరియా పర్యటనలో కంపెనీలకు ఆహ్వానంపై ఉమ్మడి వరంగల్ జిల్లా వాసుల ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

కొరియా కంపెనీలతో సీఎం చర్చలు

వరంగల్‌లోని కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కులో పెట్టుబడులు పెట్టాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆహ్వానికి దక్షిణ కొరియా టెక్స్‌టైల్ ఫెడరేషన్ సానుకూలంగా స్పందించింది. విదేశీ పర్యటనలో భాగంగా సోమవారం దక్షిణ కొరియా దేశంలో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా జరిగిన బిజినెస్ రౌండ్‌టేబుల్ సమావేశంలో పలు గ్లోబల్ కంపెనీల అధినేతలు, బిజినెస్ గ్రూపులతో సమావేశాలు, చర్చలు జరిపారు. ఈ సందర్భంగా కొరియా ఫెడరేషన్ ఆఫ్ టెక్స్‌టైల్ ఇండస్ట్రీ (కేవోఎఫ్‌వోటీఐ) ఆధ్వర్యంలో జరిగిన బిజినెస్ రౌండ్‌టేబుల్ సమావేశంలో వరంగల్ కాకతీయ టెక్స్‌టైల్ పార్కులో సౌకర్యాలు, ప్రభుత్వం అందించే సహకారంపై సీఎం వివరించారు. టెక్స్‌టైల్ రంగం అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న కార్యాచరణపై స్థానిక కంపెనీలతో పాటు ప్రపంచస్థాయి కంపెనీలకు కూడా అనుకూలంగా ఉందని సీఎం రేవంత్‌రెడ్డి వివరించారు. వరంగల్ కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కులో పెట్టుబడులకు సంబంధించిన అవకాశాలపై సీఎం వివరించారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో యంగాన్ కార్పొరేషన్ చైర్మన్ కియాంగ్ సంగ్, కొరియా ఫెడరేషన్ ఆఫ్ టెక్స్‌టైల్ ఇండస్ట్రీ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ సొయంగ్ జూ సహా 25 అగ్రశ్రేణి టెక్స్‌టైల్ కంపెనీల అధినేతలు పాల్గొన్నారు. కాగా, సీఎంతో పరిశ్రమలు, ఐటీశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

బాలికపై అత్యాచారయత్నానికి పాల్పడిన వ్యక్తికి పదేళ్ల జైలు శిక్ష, జరిమానా

వరంగల్ లీగల్, ఆగస్టు 12: ఐదేళ్ల బాలికపై అత్యాచారయత్నానికి పాల్పడిన వ్యక్తికి పదేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ వరంగల్ జిల్లా మొదటి అదనపు సెషన్స్ జడ్జ్ కం పోక్సో కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి ప్రేమలతారెడ్డి సోమవారం తీర్పు చెప్పారు. అలాగే బాధితురాలికి రూ.లక్ష నష్టపరిహారం అందించాలని ప్రభుత్వాన్ని ఆదేశించారు. కేసు వివరాలు ఇలా ఉన్నాయి. వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం ఖాదర్‌పేటకు చెందిన ఐదేళ్ల బాలిక.. తన తల్లితోపాటు వ్యవసాయ భూమి వద్దకు వెళ్లింది. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన కొనకటి రఘుపతి జామపండ్లు తినిపిస్తానని పక్కకు తీసుకెళ్లి అత్యాచారయత్నానికి పాల్పడినట్లు బాలిక తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు నిందితుడిపై పోక్సో చట్టం ప్రకారం కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. కేసు విచారణలో నేరం రుజువైనందున నిందితుడు రఘుపతికి పదేళ్ల జైలు శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. కోర్టు పీసీ పి.సురేందర్ సాక్షులను ప్రవేశపెట్టగా దర్యాప్తు అధికారులుగా ఎస్సైలు కోట మహేందర్‌రెడ్డి, జి.అరుణ్ వ్యవహరించారు. భరోసా లీగల్ అధికారి సీహెచ్ నీరజ కేసు విచారణలో సహకరించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ మర్రి వాసుదేవరెడ్డి కేసు వాదించారు.

ప్రయాణికుడి ప్రాణాలు కాపాడిన డ్రైవర్

అభినందించిన ఆర్టీసీ ఎం.డి సజ్జనార్

బాలసముద్రం, ఆగస్టు 12: హైదరాబాద్ ఉప్పల్ నుంచి డిలక్స్ బస్సులో హనుమకొండకు వస్తున్న ప్రయాణికుడికి మూర్ఛరావడంతో డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించిన డ్రైవర్ ప్రయాణికుడి ప్రాణాలు కాపాడడు. దీంతో ఆర్టీసీ ఎం.డి. సజ్జనార్ డ్రైవర్‌కు సోమవారం అభినందనలు తెలిపారు. వరంగల్-2డిపోలో డ్రైవర్‌గా పని చేస్తున్న బి.వెంకన్న హైదరాబాద్ ఉప్పల్- హనుమకొండకు బస్సు సర్వీసు నడుపుతున్నాడు. ఈ క్రమంలో సోమవారం ఉప్పల్ నుంచి హనుమకొండకు వస్తున్న క్రమంలో బస్సులో ఉన్న ప్రయాణికుడికి ఒక్కసారిగా మూర్ఛ రావడంతో తోటి ప్రయాణికులు అంబులెన్స్‌కు సమాచారం అందించారు. అంబులెన్స్ అరగంట సమయం పడుతుందని చెప్పడంతో ఘట్‌కేసర్ నుంచి బీబీనగర్ వరకు డ్రైవర్ బస్సును వేగంగా తీసుకువచ్చి ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకుపోయినట్లు తెలిపారు. ప్రయాణికుడికి సమయానికి వైద్యం అందించడంతో ప్రయాణికుడు సురక్షితంగా ఉన్నట్లు తెలిపారు. కాగా, బస్సులో ఉన్న ఓ ప్రయాణికుడు ట్విట్టర్‌లో ఆర్టీసీ ఎం.డి. సజ్జనార్‌కు ఫొటోతీసి వివరాలు పోస్టు చేయడంతో ట్విట్టర్ ద్వారా డ్రైవర్‌కు సజ్జనార్ అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వరంగల్ రీజినల్ మేనేజర్ డి.విజయభాను, వరంగల్-2డిపో మేనేజర్ వి.జోత్స్న అధికారులు డ్రైవర్ వెంకన్నకు అభినం దనలు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని మహిళ మృతి

స్టేషన్‌ఘన్‌పూర్, ఆగస్టు 12: స్టేషన్‌ఘన్‌పూర్‌లోని జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొట్టిన సంఘటనలో ఓ గుర్తు తెలియని మహిళ (సుమారు 50-55 ఏళ్లు) మృతి చెందింది. ఈ సంఘటన సోమవారం ఉదయం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. డివిజన్ కేంద్రంలోని సబ్‌స్టేషన్ సమీపంలో జాతీయ రహదారి వెంట ఓ గుర్తు తెలియని మహిళ నడుచుకుంటూ వస్తోంది. ఈ క్రమంలో జనగామ నుంచి హనుమకొండ వైపు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి కొంత దూరం మృతదేహాన్ని ఈడ్చుకెళ్లింది. రహదారిపై పడిన మృతదేహంను ఆ సమయంలో ఎవరూ గమనించకపోవడంతో జనగామ నుంచి హనుమకొండ వైపు అతివేగంగా వెళ్లే వివిధ వాహనాలు మృతదేహం పైనుంచి వెళ్లడంతో పూర్తిగా నుజ్జునుజ్జు కావడంతో పాటు శరీర భాగాలు చెల్లాచెదురుగా పడిపోయాయి. అటుగా వెళ్లిన గ్రామ పంచాయతీ సిబ్బంది రహదారిపై మహిళ మృతదేహాన్ని గమనించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సంఘటన స్థలానికి పోలీసు సిబ్బంది, జీపీ సిబ్బంది చేరుకొని మహిళ మృతదేహం ను, శరీర భాగాలను ప్యాక్ చేసి వరంగల్ ఎంజీఎంకు తరలించారు. ఘన్‌పూర్ జీపీ జూనియర్ అసిస్టెంట్ బుర్ర శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ జి.వేణు తెలిపారు.

కాళోజీ కళాక్షేత్రానికి రూ.45 కోట్ల నిధులు

వరంగల్ కార్పొరేషన్, ఆగస్టు 12: గ్రేటర్ వరంగల్ పరిధిలోని హనుమకొండ బాలసముద్రంలో నిర్మిస్తున్న కాళోజీ కళాక్షేత్రం నిర్మాణం చేసేందుకు రూ.45 కోట్ల నిధులను విడుదల చేస్తూ మంగళవారం రాష్ట్ర ప్రభుత్వం జీవో విడుదల చేసింది. 2015లో రాష్ట్ర ప్రభుత్వం రూ.85.10కోట్లతో వరంగల్ నగరంలో కాళోజీ కళాక్షేత్రం నిర్మాణాలు చేపట్టాలని ప్రత్యేక జీవోను జారీ చేస్తూ ముందుగా రూ.40.10కోట్ల నిధులను మంజూరు చేస్తూ నిర్మాణ పనులను తెలంగాణ టూరిజం శాఖకు పనులను అప్పగించింది. కానీ సదరు శాఖ అధికారులు పనుల్లో జాప్యం చేయడంతో అప్పటి ప్రభుత్వం కాళోజీ కళాక్షేత్రం నిర్మాణ పనులను వరంగల్ కుడాకు అప్పగించింది. అప్పటి నుంచి కుడా అధికారులు పనులు చేస్తున్నారు. కాగా పనులు అంతిమదశకు చేరడంతో మిగతా పెండింగ్ నిధులు మంజూరు చేయాలని కుడా వైస్ చైర్మన్ అశ్విని తానాజీ వాకడే రాష్ట్ర ముఖ్యమంత్రితో పాటు సంబంధిత అధికారులను కోరారు. వారు వెంటనే స్పందించి పెండింగ్‌లో ఉన్న రూ.45కోట్ల నిధులను విడుదల చేస్తూ జిల్లా అధికారులకు సమాచారం ఇవ్వడంతో పాటు ప్రత్యేక జీవోను విడుదల చేశారు. అంతేకాకుండా సెప్టెంబరు 9లోగా కళాక్షేత్రం పనులు పూర్తి చేయాలని ఆదేశించినట్టు కుడా అధికారులు తెలిపారు.

55 క్వింటాళ్ల పీడీఎస్ రైస్ పట్టివేత

వరంగల్ క్రైం, ఆగస్టు 12: కమలాపూర్ మండలం అంబాల గ్రామంలో రూ.1లక్ష 37వేల విలువ కలిగిన 50 క్వింటాళ్ల పీడీఎస్ రైస్‌ను సోమవారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. టి.రాజు అనే వ్యక్తి అంబాల పరిసర ప్రాంతాల్లో పీడీఎస్ రైస్‌ను కొనుగోలు చేసి తరలిస్తున్నట్లు సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడిచేసి పట్టుకున్నారు. విచారణ నిమిత్తం రాజును కమలాపూర్ పోలీసులకు అప్పగించారు. ఈ విషయాన్ని టాస్క్‌ఫోర్స్ సీఐ రంజిత్‌కుమార్ ధ్రువీకరించారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

మడికొండ, ఆగస్టు 12: యువకుడి వేధింపులు భరించలేక గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన వివాహిత(అంగన్‌వాడీ టీచర్) చికిత్స పొందుతూ మృతి చెందింది. మడికొండ ఏఎస్సై చంద్రమౌళి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రేటర్ వరంగల్ 64వ డివిజన్ టేకులగూడెం గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ ఆరుముల్ల రమేష్‌కు అదే గ్రామానికి చెందిన అనితకు 14 యేళ్ల కిందట వివాహం జరుగగా వారికి ఇద్దరు కుమారులు ఉన్నారు. కాగా, కొన్ని నెలలుగా అదే గ్రామానికి చెందిన మాతంగి రాజుతో ఏర్పడిన పరిచయాన్ని ఆసరాగా తీసుకొని అతడు అనితను లైంగిక వేధింపులకు గురి చేస్తున్నాడు. ఈ విషయమై పెద్దమనుషుల సమక్షంలో పంచాయితీ జరిగింది. కొన్ని రోజులు అనిత తన తల్లిగారింటికి వెళ్లి వచ్చింది. రాజు తిరిగి ఫోన్ చేస్తూ, మెసేజ్‌లు చేస్తూ వేధిస్తూ బ్లాక్ మెయిల్ చేస్తుండడంతో అప్పటికే తన పరువుపోయిందని భావించిన అనిత.. ఈనెల 10న గడ్డి మందు తాగింది. తన కుమారుడి ద్వారా విషయం తెలుసుకున్న ఆమె భర్త ఆమెను ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందింది. మృతురాలి భర్త రమేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

విషజ్వరంతో బాలుడి మృతి



లకావత్ రాజశేఖర్ (ఫైల్)

కొత్తగూడ, ఆగస్టు 12: విషజ్వరంతో బాలుడు మృతి చెందిన ఘటన మహబూబాబాద్ జిల్ల కొత్తగూడ మండలంలోని చిన్నతండాలో సోమవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రేణ్యాతండా గ్రామపంచాయతీ పరిధిలోని చిన్నతండాకు చెందిన లకావత్ లక్ష్మీ, రామచంద్రుల కుమారుడు రాజశేఖర్‌కు(17) రెండు రోజుల క్రితం తీవ్రజ్వరం వచ్చింది. దీంతో కుటుంబ సభ్యులు హనుమకొండలోని ఓ ప్రయివేట్ ఆస్పత్రిలో చేర్పించగా, చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతిచెందాడు.

వరంగల్ జిల్లా లీగల్ సెల్ చైర్మన్‌గా శ్రీనివాస్

కన్వీనర్‌గా కొక్కొండ రమేష్ నియామకం



శామంతుల శ్రీనివాస్



కొక్కొండ రమేష్

వరంగల్ లీగల్, ఆగస్టు 12: వరంగల్ జిల్లా కాంగ్రెస్ కమిటీ లీగల్ సెల్ చైర్మన్‌గా, న్యాయవాది శామంతుల శ్రీనివాస్‌ను, కన్వీనర్‌గా న్యాయవాది కొక్కొండ రమేష్‌ను నియమిస్తూ రాష్ట్ర లీగల్ సెల్ చైర్మన్ పొన్నం అశోక్ గౌడ్ ఉత్తర్వులు జారీ చేశారు. సోమవారం ఈ మేరకు రాష్ట్ర లీగల్‌సెల్ అధికార ప్రతినిధి నిమ్మాని శేఖర్‌రావు చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేశారు. అదే విధంగా వైస్‌చైర్మన్లుగా న్యాయవాదులు ఇ.ఆనంద్‌మోహన్, మహ్మద్ అజామ్, గునిగంటి శ్రీనివాస్, ఇజ్జగిరి సురేష్, కొడిదల సంజయ్‌కుమార్, గంపా వెంకట రమణను నియమించారు. జాయింట్ కన్వీనర్లుగా న్యాయవాదులు జీవీ రమణమూర్తి, గన్ను హరిహర కుమార్, ఎం. శ్రీనాథ్‌బాబు, రొడ్డ అమృతరావు, రాచర్ల సురేశ్, మహ్మద్ జానికి నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా పలువురు న్యాయవాదులు అభినందనలు తెలిపారు.

భూ వివాదంలో హెడ్‌కానిస్టేబుల్ సస్పెన్షన్

వరంగల్ క్రైం, ఆగస్టు 12: భూ వివాదంలో జోక్యం చేసుకున్న ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ తోట బాబు అలియాస్ పోలీస్ బాబుపై సస్పెన్షన్ వేటు పడింది. సోమవారం ఈ మేరకు సీపీ ఉత్తర్వులు జారీ చేశారు. 2019లో వరంగల్ ప్రాంతలో స్థలం కొనుగోలు చేసేందుకు ఒక వ్యక్తి కొంత మొత్తాన్ని చెల్లించి అగ్రిమెంట్ చేసుకున్నాడు. ఆ సమయంలో కరోనా రావడంతో సదరు వ్యక్తి స్థల యజమానికి పూర్తిగా డబ్బులు చెల్లించలేదు. దీంతో యజమాని ఇటీవల వేరే వ్యక్తికి విక్రయించాడు. ఇది తెలిసి మొదట అగ్రిమెంట్ చేసుకున్న వ్యక్తి వచ్చి స్థల యజమానితో గొడవకు దిగాడు. ఈ తంతు మొత్తం ఇంతేజార్‌గంజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఆ సమయంలో హెడ్‌కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్న బాబు భూ వివాదం విషయం తలదూర్చి సీఐ పేరు చెప్పి డబ్బులు తీసుకున్నట్లు తెలిసింది. రెండు రోజుల కిందట ఇరువర్గాల మధ్య శివనగర్‌లో జరిగిన పంచాయితీకి హాజరైన బాబు.. అగ్రిమెంట్ చేసుకున్న వ్యక్తిని బెదిరించినట్లు తెలిసింది. ఆదివారం బాధితులు మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, తోట బాబుతో పాటు మరో వ్యక్తిపై కేసు నమోదు చేశారు. కేసు నమోదు చేసి విచారణ చేపట్టిన పోలీసులు.. సీపీకి నివేదిక ఇవ్వగా, బాబుపై సస్పెన్షన్ వేటు పడింది. ఈ విషయమై మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్ సీఐ మల్లయ్యను వివరణ కోరగా కానిస్టేబుల్‌పై తమ స్టేషన్‌లో ఎలాంటి కేసు నమోదు కాలేదని తెలపడం గమనార్హం.

అస్తవ్యస్త గురుకులాలు

5వ పేజీ తరువాయి

పడుతున్నారు. హాస్టళ్లలోని విద్యార్థులకు నేటి వరకు యూనిఫామ్ అందించలేదు.

ములుగు జిల్లా

ములుగు జిల్లాలోని ములుగు మండలం బండారుపల్లిలోగల తెలంగాణ బాలుర గురుకులంలో ఈనెల 1వ తేదీ రాత్రి 8వ తరగతి విద్యార్థి శ్రీకర్ విషపురుగు కుట్టడంతో ఆస్పత్రికి తీసుకువెళ్లి చికిత్స చేయించారు. 2వ తేదీన తెల్లవారుజామున 5గంటలకు 10వ తరగతి విద్యార్థి ప్రణయ్ కడుపునొప్పితో బాధపడుతుండగా ములుగు ఆస్పత్రిలో ప్రథమ చికిత్స తర్వాత ఉపాధ్యాయులు హనుమకొండలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఆదేరోజు ఉదయం 8గంటల సమయంలో పాఠశాల మైదానంలో ప్రార్థన జరుగుతుండగా, పదో తరగతి విద్యార్థి కార్తీక్ స్పృహతప్పి పడిపోయాడు. హుటాహుటిన ఏరియా వైద్యశాలకు తరలించగా పరిస్థితి విషమించడంతో వెంటనే హనుమకొండకు ఉపాధ్యాయులు తరలించారు. ప్రస్తుతం కార్తీక్ ఆరోగ్యం ఆందోళనకరంగా ఉన్నట్లు తెలిసింది. వారంరోజులుగా సదరు విద్యార్థి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ గురుకులం చుట్టూ ప్రహరీ సరిగ్గా లేకపోగా పిచ్చి మొక్కలు దట్టంగా మొలవడంతో విషపురుగుల సంచారం ఉంది. తరుచూ విద్యార్థులు పాములు, తేళ్లను చూస్తున్నట్లు చెప్పారు. ఒకేరోజు ముగ్గురు విద్యార్థులు అస్వస్థతకు గురికావడంతో స్పందించిన రాష్ట్ర మంత్రి సీతక్క గురుకులాన్ని సందర్శించారు. విద్యార్థులకు ధైర్యం చెప్పి ప్రహరీ నిర్మాణానికి ప్రతిపాదనలు రూపొందించాలని అధికారులకు సూచించారు. ప్రస్తుతం ములుగు మండలం మల్లంపల్లి వద్ద ఓ ప్రైవేటు భవనంలో మంగపేట సాంఘిక సంక్షేమ బాలుర గురుకులం కొనసాగుతోంది. భవనం సమీపంలోనే అటవీ ప్రాంతం ఉండటం, చుట్టూ పరిసరాలు చిత్తడిగా ఉండటంతో విద్యార్థులకు రక్షణ కరువైంది. జాకారం సాంఘిక సంక్షేమ బాలుర పాఠశాల/కళాశాల గురుకులం పరిస్థితి కూడా దాదాపు ఇదే విధంగా ఉంది. చుట్టూ ప్రహరీ ఉన్నప్పటికీ సమీపంలో అటవీ ప్రాంతం, చిత్తడి ప్రదేశాలుండటంతో ప్రమాదం పొంచి ఉంది. కాగా, ములుగులోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకులం మూడంతస్థుల ప్రైవేటు భవనంలో కొనసాగుతోంది. ఆటస్థలం లేకపోవడంతో బాలికలు పక్కనే ఉన్న ప్రైవేటు ఖాళీ స్థలాన్ని ఉపయోగించుకుంటున్నారు. చుట్టుపక్కల పరిసరాలు అపరిశుభ్రంగా ఉన్నాయి. తీవ్ర మానసిక ఒత్తిడికి గురైన ఈ గురుకులానికి చెందిన 9వ తరగతి విద్యార్థిని కార్తీకశ్రీ ఈనెల 9న పాఠశాల భవనం మూడో అంతస్థు నుంచి దూకింది. తీవ్ర గాయాలతో బాలిక ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది.

మహబూబాబాద్ జిల్లా

మహబూబాబాద్ జిల్లా పరిధిలోని 18 మండలాల్లో సాంఘిక, గిరిజన సంక్షేమ గురుకుల, ఆశ్రమ పాఠశాలలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాలు, మోడల్ స్కూల్, ఏకలవ్య గురుకుల పాఠశాల, కళాశాలల బాల, బాలికల వసతిగృహాలు 21 ఉన్నాయి. వీటిల్లో కొన్ని మహాత్మాజ్యోతిబా పూలే, మైనారిటీ, బీసీ, ఎస్సీ, ఎస్టీ హాస్టళ్ల అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి, జిల్లా కేంద్రంలోని ఎస్సీ, ఎస్టీ బాలుర కళాశాల హాస్టల్‌లో నీటి సమస్య తలెత్తితే పక్కనే ఉన్న ఎస్సీ (సి,ఈ) బాలుర పాఠశాల హాస్టల్‌లో స్నానాలు చేయాల్సిన దుస్థితి నెలకొంది.

జనగామ జిల్లా

జనగామ జిల్లాలో 5 సాంఘిక సంక్షేమ గురుకులాలు, 8 బీసీ గురుకులాలు, 2 మైనారిటీ గురుకులాలు, ఒక రెసిడెన్షియల్ పాఠశాల ఉన్నాయి. గతంలో ఏర్పాటైన గురుకులాల భవనాలు పాతబడి శిథిలావస్థకు చేరుకున్నాయి. స్టేషన్‌ఘన్‌పూర్‌లోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో మరుగుదొడ్ల తలుపులరేకులు విరిగిపోయాయి. జనగామ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లోని మరుగుదొడ్లకు అసలు తలుపులే లేవు. పాలకుర్తిలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల ఆవరణలో పిచ్చిమొక్కలు దట్టంగా పెరిగి అడవిని తలపిస్తోంది. ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకులు లీకేజీ అవుతున్నాయి. పాలకుర్తి మండలంలోని గిరిజన బాలికల గురుకుల పాఠశాల, తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలల్లో విద్యార్థులకు సరిపడా గదులు, మంచాలు లేవు. పాలకుర్తిలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల ప్రహరీ వర్షానికి కూలిపోయి మూడేళ్లవుతోంది. విద్యార్థులకు రక్షణ లేకుండా పోయింది. విద్యార్థులకు ఇప్పటివరకు చెద్దర్లు, దుప్పట్లు ఇవ్వలేదు. స్టేషన్‌ఘన్‌పూర్ మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో మరుగుదొడ్లు అధ్వాన్నంగా ఉన్నాయి.

జయశంకర్ భూపాలపల్లి జిల్లా

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 6 గురుకులాలు ఉన్నాయి. వీటిల్లో ఈ యేడాది విద్యాసంవత్సరానికి గాను 2,460 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. భూపాలపల్లి పట్టణంలోని గాంధీనగర్‌లో గల మైనారిటీ గురుకుల రెసిడెన్షియల్ పాఠశాలలో సరిపడా గదులు లేవు. 380 మంది విద్యార్థులకు గాను 9 గదులు నిద్రించడానికి, 6 గదులు క్లాస్ రూమ్‌లకు వినియోగిస్తున్నారు. రాత్రుల్లో వరాండాల్లోనే నిద్రిస్తున్నారు. పడుకునే బెడ్ల పక్కనే ర్యాక్‌లపై వారి దుస్తులు ఆరబెట్టుకోంటున్నారు. ఫ్యాన్‌లు సరిపడా లేవు. ఇప్పటివరకు విద్యార్థులకు నోట్ పుస్తకాలు మంజూరు కాలేదు. యూనిఫామ్ కూడా రాలేదు. సౌకర్యాలపై ఒకరిద్దరు విద్యార్థులను పలకరించగా భోజనం సరిగ్గా ఉండటం లేదని చెప్పుకొచ్చారు. రాత్రి వేళల్లో దోమలతో సావాసం చేయాల్సి వస్తోందని వాపోయారు.

తండ్రి మృతితో ఆగిన గుండె

పెద్దంపేటలో తనయుడి హఠాన్మరణం ● తండ్రికొడుకుల మృతితో విషాదఛాయలు



బీసుల పెద్ద లస్మయ్య(ఫైల్)



బీసుల కృష్ణరాజు(ఫైల్)

మహదేవపూర్ రూరల్, ఆగస్టు 12: కనిపెంచిన తండ్రి హఠాన్మరణంతో తనయుడి గుండె తట్టుకోలేకపోయింది. తండ్రి మృతితో తల్లడిల్లుతూ రోదించిన కొడుకు సైతం గుండెపోటుతో మృత్యువాత పడడంతో ఆ కుటుంబంలో విషాద ఛాయలు నెలకొన్నాయి. కుటుంబానికి పెద్దదిక్కుగా ఉన్న తండ్రి, కొడుకుల మృతితో గ్రామంలో రోదనలు మిన్నంటాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం పెద్దంపేట గ్రామానికి చెందిన బీసుల పెద్ద లస్మయ్య(62) సోమవారం ఉదయం గుండెపోటుతో మృతి చెందాడు. తండ్రి మృతిని తట్టుకోలేని ఆయన పెద్ద కొడుకు బీసుల కృష్ణరాజు(30) రోదిస్తూనే తండ్రి అంత్యక్రియలు నిర్వహించారు. మధ్యాహ్నం తండ్రి అంత్యక్రియలు నిర్వహించిన అనంతరం ఇంటికి వచ్చిన కొడుకు.. అస్వస్థతకు గురికావడంతో కుటుంబసభ్యులు జిల్లా కేంద్రంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అప్పటికే కృష్ణరాజు మృతిచెందినట్లు వైద్యులు చెప్పడంతో ఆ కుటుంబం శోకసంద్రంలో మునిగిపోయింది. గంటల వ్యవధిలోనే ఒకే కుటుంబానికి చెందిన తండ్రీకొడుకులు మృతిచెందడంతో ఆ గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. తండ్రి లస్మయ్యకు భార్యతో పాటు ఇద్దరు కుమారులు కాగా, కృష్ణరాజు మొదటి సంతానం. కృష్ణరాజుకు భార్య రాణితో పాటు ఎనిమిది నెలల కుమారుడు ఉన్నాడు.

డీఎస్ఆర్ కోళ్ల ఫామ్‌ను వెంటనే మూసివేయాలి

హనుమకొండ కలెక్టరేట్ ఎదుట గ్రామస్తుల ధర్నా



హనుమకొండ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న గ్రామస్తులు, సీపీఐ(ఎంఎల్)నాయకులు

హనుమకొండ కలెక్టరేట్, ఆగస్టు12: హనుమకొండ జిల్లాలోని ఆత్మకూరు మండలం నీరుకుళ్ల గ్రామంలో ఉన్న డీఎస్ఆర్ కోళ్ల ఫామ్‌ను వెంటనే మూసి వేయాలని నీరుకుళ్ల (కందిబండ), పెంచికలపేట, కేవశాపురం గ్రామాలకు చెందిన ప్రజలు.. సీపీఐ (ఎంఎల్)నాయకులతో కలిసి సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ (ప్రజాపంథా) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు గడ్డం సదానందం గ్రామస్తులతో కలిసి మాట్లాడారు. నీరుకుళ్ల గ్రామ శివారులోని చెన్నకేశవ స్వామి ఆలయం పక్కనే వేరు గ్రామాలకు చెందిన వ్యక్తులు లాభార్జనే ధ్యేయంగా పౌల్ట్రీఫామ్‌లు ఏర్పాటుచేసి గ్రామ ప్రజలకు తీవ్ర ఇబ్బంది కలిగిస్తున్నారన్నారు. కోళ్లఫామ్ నుంచి దుర్వాసన వస్తోందని, దీంతో గ్రామ ప్రజలు అనారోగ్యాల పాలవుతున్నారన్నారు. పారిశుధ్యంపై కోళ్లఫామ్ యజమానిని గ్రామస్తులు అడగగా గ్రామస్తులపై యజమాని దుర్భాషలాడుతూ కేసులు పెట్టించాడని ఆరోపించారు. వెంటనే కలెక్టర్ స్పందించి కోళ్లఫామ్ యజమానిపై చర్యలు తీసుకుని ఈగలు దోమల వ్యాప్తి చెంది ప్రజలను అనారోగ్యం పాలు చేస్తున్న కోళ్లఫామ్‌ను మూసివేయించాలన్నారు. ధర్నా అనంతరం కలెక్టర్ ప్రావీణ్యకు వినతిపత్రం అందజేశారు. ధర్నాలో నీరుకుళ్ల(కందిబండ), పెంచికలపేట, కేశవాపూర్ గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

గోపా రాష్ట్ర అధ్యక్షుడిగా నాగేశ్‌గౌడ్



జఫర్‌గఢ్, ఆగస్టు 12: గౌడ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్(గోపా) రాష్ట్ర అధ్యక్షుడిగా మండలంలోని కూనూరుకు చెందిన కోరుకొప్పుల నాగేశ్‌గౌడ్ నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు నోముల రాజేందర్‌గౌడ్ ఉత్తర్వులు జారీ చేశారు. గౌడ కులస్తుల సమస్యలపై ఉద్యమిస్తూ, వారి సంక్షేమానికి చేస్తున్న సేవలను గుర్తించి తనను గోపా రాష్ట్ర అధ్యక్షుడిగా నియమించినందుకు నాగేశ్‌గౌడ్ హర్షం వ్యక్తం చేశారు. వ్యవస్థాపక అధ్యక్షుడు రాజేందర్, స్టీరింగ్ కమిటీ చైర్మన్ గడ్డం కుమారస్వామిలకు కృతజ్ఞతలు తెలిపారు. మరింత బాధ్యతాయుతంగా గౌడ ఉద్యోగ, వృత్తిదారుల సంఘం బలోపేతానికి, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

పొలం బాట పట్టిన విద్యుత్ అధికారులు

రఘునాథపల్లి, ఆగస్టు 12: రఘునాథపల్లి మండల కేంద్రంలో సోమవారం విద్యుత్ శాఖ అధికారులు పొలం బాట కార్యక్రమం నిర్వహించారు. క్షేత్ర స్థాయిలో విద్యుత్ వాడకం, విద్యుత్ సమస్యలపై శాఖ అధికారులు రైతులతో చర్చించారు. ఈ సందర్భంగా ట్రాన్స్‌కో ఏడీఈ మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ వ్యవసాయ క్షేత్రాలలో విద్యుత్ తీగలు కిందికి ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. విద్యుత్ ఆదా చేసేందుకు మోటార్లకు కెపాసిటర్లు బిగించుకోవాలని, సర్వీసు వైరు అతుకులు లేకుండా చూసుకోవాలని, స్టార్టర్ బాక్సును తడి చేతులతో ముట్టుకోవద్దని, డీటీఆర్, హెచ్‌జీ ఫ్యూజ్‌లను రైతులు మార్చుకోకుండా విద్యుత్ సిబ్బందికి ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈ రాహుల్, ఫోర్‌మెన్ వీరాంజనేయులు, లైన్ ఇన్‌స్పెక్టర్ స్వామి, వెంకటరెడ్డి, జగదీశ్వర్, రైతులు యాదగిరి, సుమన్‌రెడ్డి, చంద్రయ్య, వీరమల్లయ్య, నాగరాజు, శంకరయ్య, నాగేష్, రాజు, రవిచందర్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఎర్రబెల్లి పరామర్శ



సీతారాంపురంలో కొండయ్యతో పాటు కుటుంబీకులను పరామర్శిస్తున్న దయాకర్‌రావు

దేవరుప్పుల, ఆగస్టు 12: మండలంలోని పలు గ్రామాలలో ఇటీవల రోడ్డు ప్రమాదాలకు గురై చికిత్స పొందుతున్న వారిని, అనారోగ్యంతో మృతి చెందిన కుటుంబాలను సోమవారం మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పరామర్శించారు. సింగరాజుపల్లి గ్రామానికి చెందిన మేకపోతుల నర్సింహులు భార్య రేణుక రోడ్డు ప్రమాదానికి గురై చికిత్స పొందుతుండగా పరామర్శించారు. పెద్దమడూరుకు చెందిన మూటకొండూరు శ్రీనివాస్‌శర్మ గుండెపోటుతో, సీతారాంపురం గ్రామానికి చెందిన బాషిపాక కొండయ్య భార్య స్వప్న అనారోగ్యంతో, దేవరుప్పులకు చెందిన ఉడుగు సత్యనారాయణ తల్లి ముత్తమ్మ అనారోగ్యంతో, పెద్ది వెంకన్న, కృష్ణమూర్తిల తల్లి లచ్చమ్మ అనారోగ్యంతో మరణించగా వారి కుటుంబాలను పరామర్శించి ఓదార్చారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ జిల్లా నాయకులు పల్లా సుందర్‌రామ్‌రెడ్డి, మాజీ ఎంపీపీ బస్వ సావిత్రి, మండల అధ్యక్షుడు తీగల దయాకర్, నాయకులు చింత రవి, బస్వ మల్లేశం, రామ్‌సింగ్, నర్సింహారెడ్డి, కోతి ప్రవీణ్, భిక్షపతి, గడ్డం రాజు, అన్నారపు యాదగిరి, పద్మయ్య, సుందర్, క్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యను పట్టించుకోని గత పాలకులు

జనగామ రూరల్, ఆగస్టు 12: గత పాలకులకు మద్యంపై ఉన్న దృష్టి విద్యపై లేదని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి విమర్శించారు. సోమవారం మండలంలోని పసరమడ్ల ఎస్టీ బాలుర రెసిడెన్షియల్ పాఠశాలను సందర్శించి విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కొమ్మూరి మాట్లాడుతూ విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వసతులను ఏర్పాటు చేయాలన్నారు. సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి జనగామ ప్రాంత రెసిడెన్షియల్ పాఠశాలల విద్యార్థుల సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు లింగాల నర్సిరెడ్డి, నిమ్మతి మహేందర్‌రెడ్డి, బనుక శివరాజ్, బుచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులకు ఆటల పోటీలు

కొడకండ్ల, ఆగస్టు 12: పంద్రాగస్టును పురస్కరించుకుని మండలంలోని ప్రభుత్వ ఉద్యోగులకు మండల స్థాయి ఆటల పోటీలు నిర్వహించినట్లు ఎంపీడీవో నాగ శేషాద్రి సూరి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శుల టీం, ఫీల్డ్ అసిస్టెంట్ల టీం సోమవారం క్రికెట్ ఆడినట్లు చెప్పారు. ఇందులో గెలిచిన ఫీల్డ్ అసిస్టెంట్ల టీం జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటుందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో కుమారస్వామి, ఈజీఎస్ సిబ్బంది, గ్రామ పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

తెలియని ఓటీపీలు వస్తే తెరవొద్దు : ఏసీపీ



షాపు యజమానులు, యువకులకు సూచనలిస్తున్న ఏసీపీ భీమ్‌శర్మ

స్టేషన్‌ఘన్‌పూర్, ఆగస్టు 12: వాట్సాప్‌కు, మెసేజ్ ద్వారా గాని తెలియని ఓటీపీలు వచ్చినప్పుడు వాటి జోలికి వెళ్లవద్దని స్టేషన్‌ఘన్‌పూర్ ఏసీపీ భీమ్‌శర్మ అన్నారు. సోమవారం శివునిపల్లి రైల్వే స్టేషన్ వద్ద వివిధ షాపుల యజమానులకు, యువకులకు సీపీ అంబర్ కిశోర్ ఝా, డీసీపీ రాజమహేంద్ర నాయక్‌ల ఆదేశాల మేరకు అవగాహన కల్పించారు. సెల్ ఫోన్‌లకు వచ్చే ఓటీపీలను ఎవరికి చెప్పవద్దని, వాట్సాప్‌లలో వచ్చే లింక్‌లను ఓపెన్ చేసి డబ్బులు పోగొట్టుకోవద్దని తెలిపారు. అనుకోకుండా ఎవరైన సైబర్ నేరగాళ్ల వలలో చిక్కితే వెంటనే 1930కి కాల్ చేయాలని సూచించారు. గంజాయి, మాదక ద్రవ్యాలు వినియోగిస్తూ ఎవరైన కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ముఖ్యంగా యువకులు, విద్యార్థులు గంజాయి లాంటి మత్తు పదార్థాలకు బానిస కావద్దని కోరారు. వాటిని సేవిస్తూ పట్టుబడితే జైలుపాలు అవుతారని తెలిపారు. తల్లిదండ్రులు 18 ఏళ్ల నిండని, లైసెన్స్ లేని యువకులకు వాహనాలు ఇచ్చే క్రమంలో ఏదైనా ప్రమాదం జరిగితే వాహనాల యజమానులపై కేసులు నమోదు అవుతాయని హెచ్చరించారు. పిల్లల అలవాట్లను, వారిలోవస్తున్న మార్పులను గమనించి తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీఐ జి.వేణు, ఏఎస్సై రాజమౌళి, సిబ్బంది ఎం.కుమార్, రజాక్‌పాషా, శ్రీనివాస్ పాల్గొన్నారు.

క్రీడా కార్యదర్శిగా ఆడెపు శ్రీనివాస్

జనగామ కల్చరల్, ఆగస్టు 12: జనగామ జిల్లా పాఠశాల క్రీడా కార్యదర్శిగా ఆడెపు శ్రీనివాస్ నియమితులయ్యారు. ఈమేరకు సోమవారం డీఈవో కె.రాము ఉత్తర్వులు అందజేశారు. శ్రీనివాస్ జనగామ జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల పాఠశాల పీఈడీగా పని చేస్తున్నారు. 2024-26 విద్యా సంవత్సరాలకు గాను శ్రీనివాస్ నియామకం పట్ల జిల్లాలోని పీఈడీలు ఫూల్‌సింగ్, మనోజ్‌కుమార్, అశోక్‌కుమార్, సుధారాణి, పద్మ, సంగీత మాధురి, రవికుమార్, కిరణ్‌కుమార్, ఇంద్రసేనారెడ్డి, నాగరాజు, కుద్దూస్ తదితరులు అభినందనలు తెలిపారు.

సమగ్ర శిక్ష ఉద్యోగులకు భద్రత కల్పించాలి

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్, ఆగస్టు 12: అతి తక్కువ వేతనాలతో తీవ్ర ఒత్తిడితో పనిచేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా కోఆర్డినేటర్ జి.యాదగిరి డిమాండ్ చేశారు. ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన ఉద్యోగుల చిత్ర పటానికి సోమవారం స్టేషన్ ఘన్‌పూర్ ఎంఆర్‌సీ వద్ద పలువురు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాలీచాలని జీతాలతో కుటుంబ పోషణ భారాన్ని మోయలేక సగటున నెలకు ఇద్దరు చనిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఖమ్మం జిల్లాలో దాసు, రంగారెడ్డి జిల్లాలో టీవీఎస్ ప్రసాద్, నారాయణపేట జిల్లాలో వెంకటరాములు, ఆదిలాబాద్‌లో మమత గుండెపోటుతో మృతి చెందారన్నారు. ఉద్యోగులను సీఎం రేవంత్‌రెడ్డి టైం స్కేల్ ఇస్తూ వెంటనే రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ఆరోగ్య బీమా రూ.5 లక్షలు, జీవిత బీమా రూ.10లక్షలు కల్పించాలన్నారు. రిటైర్ అయిన వారికి రూ.10లక్షలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు పి.వెంకటేశ్వర్లు, టి.రమేశ్, ఆర్.రాంగోపాల్, డి.ప్రవీణ్ కుమార్, పి.స్వామి, లవన్, శ్రీలత, జి.రామతులసి, కె.జ్యోతి, ఎం.రమేశ్ పాల్గొన్నారు.

నేడు జనగామ బంద్

జనగామ కల్చరల్, ఆగస్టు 12 : బంగ్లాదేశ్‌లోని హిందువులకు మద్దతుగా ఈనెల 13న జనగామ బంద్‌కు పిలుపునిచ్చినట్లు విశ్వహిందూ పరిషత్ నాయకులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బంగ్లాదేశ్‌లోని హిందువులతో పాటు భారత్ నుంచి ఉన్నత చదువుల కోసం బంగ్లాదేశ్‌కు వెళ్లిన హిందువులపై కూడా దాడులు, మహిళలపై అత్యాచారాలు జరుగుతున్నాయని అన్నారు. ఈ సంఘటనలకు నిరసనగా, హిందువులకు మద్దతుగా నిర్వహించే బంద్‌కు పట్టణంలోని వ్యాపార, వాణిజ్య వర్గాలు, విద్యా సంస్థల యాజమాన్యాలు సహకరించాలని వీహెచ్‌పీ, హిందూవాహిని, భజరంగ్‌దళ్ నేతలు కోరారు.

ఎన్‌పీఎస్‌ను రద్దు చేయాలి

జనగామ రూరల్, ఆగస్టు 12: నూతన పింఛన్ విధానాన్ని (ఎన్‌పీఎస్) రద్దుచేసి పాతపింఛన్ విధానాన్ని(ఓపీఎస్) అమలు చేయాలని డిమాండ్ చేస్తూ రైల్వే ఉద్యోగులు సోమవారం జిల్లా కేంద్రంలోని రైల్వేస్టేషన్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ నాయకులు తిరుపతిరావు, దేవరాజు ఎలేందర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న 18నెలల బకాయి డీఏలు, అలవెన్సులు వెంటనే చెల్లించాలని, 8పే కమిషన్ ప్రక్రియ చేపట్టాలని, ఎన్‌పీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో దేశ వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో శ్రీశైలం, తిరుపతి, జోగు భాస్కర్, మేడ మల్లేష్, కిరణ్, నరేష్, రాజ్యలక్ష్మి, అనిత తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీ సమస్యలను పరిష్కరించాలి : కలెక్టర్

జనగామ రూరల్, ఆగస్టు 12: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలలో రైతుల రుణమాఫీ సమస్యలను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా సహకార సంఘం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతు రుణమాఫీలో మొదటి, రెండవ విడతల్లో మాఫీ రాని వివరాలు సేకరించి నివేదిక ఇవ్వాలన్నారు. అలాగే సమస్యలను పరిష్కరించాలన్నారు. సమావేశంలో జిల్లా సహకార శాఖ అధికారి రాజేందర్‌రెడ్డి, ఏఈవో వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు ఎన్‌ఆర్‌ఐ రూ.50వేల విరాళం

బచ్చన్నపేట, ఆగస్టు 12: తాను చదువుకున్న పాఠశాలలో నీటి వసతులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని ఆంగ్లంను బోధించే ఉపాధ్యాయుడు భాస్కరుని పృథ్వీరాజ్ చిన్ననాటి మిత్రుడు, ఎన్‌ఆర్‌ఐ పులిగిళ్ల శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో నీటివసతులు కల్పించేందుకు రూ.50వేలు అందించారు. దీంతో మోటారు కొనుగోలు చేయటంతో పాటు పైప్‌లైన్, ట్యాంక్ బిగింపు చేసి ఇబ్బందులను తొలగించారు. శ్రీనివాస్, పృథ్వీరాజ్‌ను హెచ్ఎం వెంకటరెడ్డి, రాంచంద్రం అభినందించారు.

ఘనంగా ఏఐఎస్‌ఎఫ్ ఆవిర్భావ వేడుకలు

స్టేషన్‌ఘన్‌పూర్, ఆగస్టు 12: డివిజన్ కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్ వద్ద సోమవారం ఏఐఎస్‌ఎఫ్ 89వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఏఐఎస్‌ఎఫ్ జెండాను జిల్లా కన్వీనర్ ఎమ్డీ యూనస్ ఆవిష్కరించి మాట్లాడారు. స్వాతంత్ర్య ఉద్యమం సమయంలో విద్యార్థులను ఏకం చేసి జాతీయ స్థాయిలో ఏర్పడిన సంఘం ఏఐఎస్‌ఎఫ్ అన్నారు. విద్యా కాషాయీకరణకు వ్యతిరేకంగా కామన్ విద్యా విధానం, విద్యార్థుల హక్కుల కోసం పోరాడుతూ నాటి నుంచి నేటి వరకు విద్యార్థుల పక్షాన నిలబడుతున్న సంఘం ఏఐఎస్‌ఎఫ్ అని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎమ్డీ రహమతుల్లా, చింత జగదీష్, పృథ్వీరాజు, రాము, అక్షయ, జీవన్ పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల రహితమే ధ్యేయం



బాలయేసు పాఠశాలలో మాట్లాడుతున్న కరస్పాండెంట్ బ్రదర్ జేసురాజ్

దేవరుప్పుల, ఆగస్టు 12: మాదక ద్రవ్య రహితమే ధ్యేయమని బాలయేసు పాఠశాల కరస్పాండెంట్ బ్రదర్ జేసురాజ్ అన్నారు. దేవరుప్పుల మండల కేంద్రంలోని బాలయేసు పాఠశాలలో సోమవారం నషా ముక్త్ భారత్ అభియాన్ కింద ఐక్యతతో విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే విలువలతో కూడిన జీవితాన్ని కొనసాగించాలని సూచించారు. అప్పుడే రాష్ట్రం అభివృద్ధి వైపు ప్రయాణిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మదన్‌మోహన్, మహేష్, కృష్ణ, పాషా, మాధవి, విజయలక్ష్మి, సరిత, ఖాజా తదితరులు పాల్గొన్నారు.

ఇరువురు మావోయిస్టుల లొంగుబాటు

(5వ పేజీ తరువాయి)

సంబంధించిన వివరాలను ఆయన మీడియాకు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం బాపట్ల జిల్లా వేటపాలెం మండలం రెడ్లపాలెం గ్రామానికి చెందిన దుడ్డ తేజఅమర్‌నాథ్‌రెడ్డి అలియాస్ అర్జున్ మేనమామ నాయుడు నాగార్జున మావోయిస్టు పార్టీ నల్లమల అటవీప్రాంతంలో ఏసీఎంగా పనిచేసి 2008లో అరెస్టయ్యాడు. ఆయన ప్రభావంతో మావోయిస్టు భావజాలానికి ఆకర్షితుడైన అమర్‌నాథ్‌రెడ్డి 2021లో దళాన్ని కలిసి కొంతకాలం కొరియర్ పనిచేశారు. 2022 డిసెంబర్‌లో పూర్తిస్థాయి దళసభ్యుడిగా మారి అజ్ఞాతంలోకి వెళ్లాడు. పార్టీ అతడికి 8ఎంఎం రైఫిల్‌ను ఇచ్చింది. 2024లో ఈసీఎంగా పదోన్నతి పొందాడు. ప్రస్తుతం మావోయిస్టు నేత కొయ్యడ సాంబయ్య అయాస్ ఆజాద్ రక్షణదళ సభ్యుడిగా కొనసాగుతున్నాడు. సత్యసాయి జిల్లా చెన్నెకొత్తపల్లి మండలం వెర్రంపల్లి గ్రామానికి చెందిన గాలి నారాయణరెడ్డి అలియాస్‌రాజ్‌కుమార్ తెలంగాణ రాష్ట్రంలోని జడ్చర్ల ఎలక్ట్రికల్ బస్ గ్యారేజీలో పనిచేస్తున్న క్రమంలో 2020 సెప్టెంబరులో మావోయిస్టు పార్టీలో చేరాడు. కొంతకాలం కొరియర్‌గా పనిచేసిన ఆయన దళానికి కిరాణా సామాగ్రిని అందించేవాడు. 2023 జనవరిలో ఏపీలోని ఎటపాక పోలీసుల చేత అరెస్టయిన నారాయణరెడ్డి ఈ ఏడాది బెయిల్‌పై విడుదలయ్యాడు. మార్చి 3న అమర్‌నాథ్‌రెడ్డితో ఏర్పడ్డ పరియంతో మళ్లీ దళంబాట పట్టాడు. ఈ ఇద్దరూ ఎటువంటి నేరాలలో పాల్గొనలేదని, పార్టీ విస్తరణ, కొత్త కమిటీల నిర్మాణంలో భాగస్వాములుగా ఉన్నారని ఎస్పీ శబరీశ్ తెలిపారు. అమర్‌నాథ్‌రెడ్డి పై రూ.4లక్షలు, నారాయణరెడ్డిపై రూ.లక్ష రివార్డు ఉన్నదని, లొంగిపోయిన వారికి పునరావాసం కింద ఆమొత్తాన్ని అందజేస్తామని వెల్లడించారు.

శౌర్యయాత్రను జయప్రదం చేయాలి

▸▸ ప్రజానాట్య మండలి రాష్ట్ర కార్యదర్శి నరసింహ



కర పత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

స్టేషన్‌ఘన్‌పూర్, ఆగస్టు 12: వీర తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను ప్రజలకు తెలియపర్చడం కోసం చేపట్టనున్న శౌర్యయాత్రలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై విజయవంతం చేయాలని ప్రజానాట్య మండలి రాష్ట్ర కార్యదర్శి కట్ల నరసింహ పిలుపునిచ్చారు. సోమవారం మండలంలోని ఇప్పగూడెం గ్రామంలో వీర తెలంగాణ సాయుధ పోరాట శౌర్య యాత్ర కరపత్రాలను నాయకులతోకలిసి ఆవిష్కరించి మాట్లాడారు. సెప్టెంబరు 1 నుంచి 17వ తేదీ వరకు ప్రజానాట్య మండలి కమిటీ ఆధ్వర్యంలో సాయుధ పోరాట వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అన్ని జిల్లాల్లో కళాకారుల ఆధ్వర్యంలో ప్రదర్శనలు ఉంటాయని తెలిపారు. వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వాస్తవ చరిత్రను ప్రజలకు తెలపాలనే లక్ష్యంతో కళాకారుల ఆధ్వర్యంలో ప్రదర్శనలు చేబడుతున్నట్లు తెలిపారు. బీజేపీ నాయకులు సాయుధ పోరాట చరిత్రను వక్రీకరించే ప్రయత్నం చేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు రాంపల్లి రమేష్, సాంబరాజు యాదగిరి, మునిగెల రమేష్, గట్ల మల్లారెడ్డి, తోడెంగల ఐలయ్య, కత్తుల రాజు, కర్ణాకర్, పొలాసు పరమేష్, శ్రీకాంత్, నీరటి సంపత్ తదితరులు పాల్గొన్నారు.

కార్యదర్శి బదిలీతో గ్రామస్థుల కన్నీరు



పంచాయతీ కార్యదర్శి వీరాస్వామికి ఆత్మీయ సన్మానం చేస్తున్న గ్రామస్థులు

లింగాలఘణపురం, ఆగస్టు 12: పెళ్లి అనంతరం అప్పగింతల సమయంలో కన్నీటి పర్యంతమయ్యే పెళ్లికూతురు తల్లిదండ్రులను చూస్తుంటాం.. ఉపాధ్యాయుడు బదిలీ అయితే కన్నీటి ధారలను రాల్చే విద్యార్థులను గమనిస్తుంటాం.. కానీ, లింగాలఘణపురం మండలం వడ్డిచర్ల గ్రామపంచాయతీ కార్యదర్శి జుంకాల వీరస్వామి తన ఐదేళ్ల పదవీకాలం పూర్తి చేసుకుని బదిలీ అయి వెళ్తుంటే గ్రామస్థులు భావోద్వేగానికి లోనై కన్నీటి పర్యంతం కావడం పంచాయతీ కార్యదర్శి పనితీరుకు నిదర్శనంగా మారింది. సోమవారం లింగాలఘణపురం మండలం వడ్డిచర్ల పంచాయతీ కార్యదర్శిగా పనిచేసిన వీరాస్వామికి గ్రామస్థులంతా ఐక్యమై ఆత్మీయ వీడ్కోలు సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రముఖులు, యువకులు, మాజీ ప్రజాప్రతినిధులు ఘనంగా సన్మానించి ఆయన సేవలను కొనియాడారు. అదే వేదికపై పంచాయతీ కార్యదర్శి వీరస్వామి సైతం గ్రామస్థుల సహాయ సహకారాలను గుర్తుచేసుకుంటూ సభావేదిక సాక్షిగా బోరున విలపించారు. దీంతో తీవ్ర భావోద్వేగానికి లోనైన పెన్షనర్లు, వృద్ధులు ఏకంగా కార్యదర్శిని హత్తుకుని బోరున విలపిస్తూ ఆత్మీయ వీడ్కోలు పలికారు. అనంతరం ఐదేళ్లపాటు గ్రామానికి సేవలందించిన తాజా మాజీ ఎంపీటీసీ గండి మంగమ్మయాదగిరి దంపతులను, తాజా మాజీ సర్పంచ్ కడారి కృష్ణ, మాజీ ఉపసర్పంచ్ చిటుకుల వెంకటేశ్వర్లును గ్రామస్థులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గ్రామస్థులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్ అందిస్తాం : ఎస్ఈ

జనగామ రూరల్, ఆగస్టు 12: వినియోగదారులకు మరింత నాణ్యమైన విద్యుత్‌ను అందించడానికి పంపిణీ వ్యవస్థ(సిస్టం స్ట్రెంతెనింగ్ వర్క్స్) పటిష్ట పరిచామని జనగామ ఎస్ఈ వేణుమాధవ్ ఒక ప్రకటనలో ద్వారా తెలిపారు. గడిచిన 8 నెలల్లో కొత్తగా వివిధ సామర్థ్యం గల 93 ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయడంతో ఓవర్ లోడ్ భారం తగ్గిందన్నారు. 2940 మిడిల్ పోల్స్, 2084 కొత్త పోల్స్ ఏర్పాటు చేశామని, తక్కువ ఎత్తులో ఉన్న 40 ట్రాన్స్‌ఫార్మర్లను గద్దెల ఎత్తు పెంచామన్నారు. మూడు సబ్ స్టేషన్లలో ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యాన్ని పెంచామని, నాణ్యమైన విద్యుత్ అందించడమే తమ లక్ష్యమన్నారు.

డిగ్రీ విద్యార్థిని అదృశ్యం

చిలుపూర్, ఆగస్టు 12 : డిగ్రీ చదువుతున్న విద్యార్థిని అదృశ్యమైన సంఘటన మండలంలోని వంగాలపల్లిలో జరిగింది. సోమవారం ఎస్సై సిరిపురం నవీన్‌కుమార్ తెలిపిన ప్రకారం.... గ్రామానికి చెందిన ఆరూరి వైష్ణవి హసన్‌పర్తిలోని సాంఘీక సంక్షేమ గురుకుల కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతోంది. సోమవారం కళాశాల హాస్టల్‌కు వెళ్ళేది ఉన్నందున నిత్యావసరాలు కొనుగోలు చేయడం కోసం స్టేషన్‌ఘన్‌పూర్‌కు వెళ్లొస్తానని తల్లిదండ్రులకు చెప్పి బయలుదేరింది. రాత్రి అయినా ఇంటికి రాకపోగా, సెల్ ఫోన్ స్విచ్ఛాఫ్‌గా ఉంది. దీంతో ఆందోళన చెందిన వైష్ణవి తల్లిదండ్రులు సమీప బంధువుల ఇళ్లల్లో ఆరా తీశారు. ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఓటరు జాబితాలపై అవగాహన

బచ్చన్నపేట, ఆగస్టు 12: గ్రామాల్లో ఓటరు జాబితాలకు సంబంధించిన వివరాలు సక్రమంగా ఉండేలా చూసుకోవాలని ఎంపీడీవో మల్లికార్జున్ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం పంచాయతీ కార్యదర్శులు, బీఎల్‌వోలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పంచాయతీ ఎన్నికలకు సన్నాహకంగా వార్డుల వారీగా కుటుంబ సభ్యుల వివరాలు ఒకేచోట ఉండేలా చూసు కోవాలన్నారు.

చికిత్స పొందుతూ తండ్రీకొడుకు మృతి

రఘునాథపల్లి, ఆగస్టు 12: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మండలంలోని భాంజీపేట గ్రామానికి చెందిన తాటికాయల కొంరయ్య(60), అతని కుమారుడు తాటికాయల కుమార్(40) సికింద్రాబాద్ ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం సాయంత్రం మృతి చెందారు. భాంజీపేటకు చెందిన తాటికాయల కొంరయ్య కొన్నేళ్ల క్రితం కుటుంబ సభ్యులతో సహా సికింద్రాబాద్‌కు వలస వెళ్లి చిలకలగూడలో ఆటో నడుపుతూ జీవనోపాధి పొందుతున్నాడు. సికింద్రాబాద్ నుంచి భాంజీపేటలో జరిగే బంధువుల శుభకార్యానికి హాజరయ్యేందుకు కొంరయ్య సొంత ఆటోలో కొడుకు కుమార్, కోడలు స్వప్న, మనుమడు క్రిష్‌తో కలిసి ఈనెల 11న బయలుదేరారు. మండలంలోని నిడిగొండ వద్దకు చేరుకోగానే జాతీయ రహదారిపై అదేరోజు రాత్రి ఆటోను లారీ ఢీకొంది. ఈఘటనలో ఆటోలో ఉన్న నలుగురికి గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన తండ్రి కొంరయ్య, కొడుకు కుమార్‌ను సికింద్రాబాద్ ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ డి.నరేష్ తెలిపారు.

బెల్టు షాపులపై పోలీసుల దాడులు

చిలుపూర్, ఆగస్టు 12: మండలంలోని మల్కాపూర్‌లో సోమవారం బెల్టు షాపులపై పోలీసులు దాడులు చేపట్టారు. గ్రామానికి చెందిన బూర రామనాథం ఇంట్లో అక్రమంగా నిల్వ చేసిన రూ.36వేల విలువ గల మద్యంను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. ఈసందర్భంగా ఎస్సై నవీన్‌కుమార్ మాట్లాడుతూ వరంగల్ సీపీ అంబర్ కిషోర్ ఝా ఆదేశాల మేరకు బెల్టు షాపులపై దాడులు చేపట్టినట్లు స్పష్టం చేశారు. గ్రామాల్లో బెల్టు షాపులు నిర్వహిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలికి గాయాలు

చిలుపూర్, ఆగస్టు 12: రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధురాలు తీవ్రంగా గాయపడ్డ సంఘటన మండలంలోని చిన్నపెండ్యాల హైవేపై సోమవారం జరిగింది. ఎస్సై సిరిపురం నవీన్‌కుమార్ తెలిపిన ప్రకారం... హనుమకొండ జిల్లా వేలేరు మండలం గుండ్లసాగర్ గ్రామానికి చెందిన టేకుల రాజమ్మ పని నిమిత్తం స్టేషన్‌ఘన్‌పూర్‌కు వెళ్తోంది. చిన్నపెండ్యాల వద్ద ఆర్టీసీ బస్సు ఎక్కేందుకని హైవే దాటుతుండగా, హనుమకొండ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న లారీ వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రాజమ్మకు గాయాలు కాగా, అక్కడే విధులు నిర్వహిస్తున్న పోలీసులు చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎంకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో సీఐకి గాయాలు

పాలకుర్తి, ఆగస్టు 12: రోడ్డు ప్రమాదంలో పాలకుర్తి సీఐకి గాయాలయ్యాయి. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా అర్వపల్లి మండలంలో ఆదివారం రాత్రి జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన ప్రకారం... సీఐ మహేందర్‌రెడ్డి పాలకుర్తి సర్కిల్‌లో ఏడు నెలల నుంచి విధులు నిర్వహిస్తున్నారు. సూర్యాపేటలోని బంధువుల ఇంట్లో శుభకార్యానికి భార్యతో కలిసి వెళ్లి తిరిగి ఆదివారం రాత్రి పాలకుర్తికి కారులో వస్తుండగా అర్వపల్లి మండలం ఆడివేముల గ్రామంలో కారు ప్రమాదానికి గురైంది. ఎదురుగా వస్తున్న కారును తప్పించబోయి కారు హోటల్లోకి దూసుకుపోయింది. ఈ ఘటనలో సీఐ మహేందర్‌రెడ్డి, ఆయన భార్యకు గాయాలు కావడంతో స్థానికులు సూర్యాపేటలో చికిత్స చేయించి హైదరాబాద్‌లోని కిమ్స్‌కు తరలించినట్లు బంధువులు తెలిపారు.

బాలికపై లైంగిక వేధింపులు

▸▸ నిందితుడిపై కేసు నమోదు

పాలకుర్తి, ఆగస్టు 12 : మండలంలోని ఓ గురుకుల పాఠశాలలో విద్యార్థినిని లైంగికంగా వేధించిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గత నెలలో సెలవులు రావడంతో విద్యార్థిని ఇంటికి వెళ్లింది. సెలవులు అయిపోగానే పాఠశాలకు వెళ్లకుండా ఇంటి వద్దనే ఉంటుంది. పాఠశాలకు వెళ్లాలని తల్లిదండ్రులు సూచించడంతో ససేమిరా వెళ్లనని మొండికేసింది. దీంతో వారు నచ్చచెప్పి బాలిక వద్ద విషయాన్ని రాబట్టారు. అదే పాఠశాలలో ఓ వంట సిబ్బంది తనతో అసభ్యకరంగా ప్రవర్తించాడని తల్లిదండ్రులకు చెప్పి కన్నీటి పర్యంతమైంది. తల్లిదండ్రులు సోమవారం గురుకుల పాఠశాలకు వచ్చి తన కూతురుకు జరిగిన అవమానంపై ప్రిన్సిపాల్‌కు వివరించగా పట్టించుకోలేదన్నారు. పోలీసులకు ఫిర్యాదు చేయగా ఫోక్సో కేసు నమోదు చేసినట్లు సమాచారం.

వెల్ది అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలి



ఎమ్మెల్యే కడియం శ్రీహరికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న వెల్ది గ్రామస్థులు

రఘునాథపల్లి, ఆగస్టు 12: గ్రామాభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని మండలంలోని వెల్ది గ్రామస్థులు ఎమ్మెల్యే కడియం శ్రీహరిని కోరారు. హనుమకొండలోని స్వగృహంలో సోమవారం కడియంను కలిసి కోరారు. ఈ సందర్భంగా కడియం శ్రీహరి సానుకూలంగా స్పందించి మాట్లాడుతూ మండలంలోని ప్రతీ గ్రామానికి న్యాయం జరిగేలా చూస్తానని అన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ మారజోడు రాంబాబు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోళ్ల రవిగౌడ్, పెండ్లి మల్లారెడ్డి, చెంచు రమేష్, రాసమల్ల యాదగిరి, బత్తిని మల్లేష్, లావణ్య, శ్రీనివాస రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే వరంగల్ ఎంపీ కడియం కావ్యను వెల్ది గ్రామానికి చెదిన కాంగ్రెస్ నాయకులు కలిసి గ్రామాభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరుతూ వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోళ్ల రవిగౌడ్, బత్తిని మల్లేష్, రాసమల్ల యాదగిరి, శ్రీనివాసరెడ్డి, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ ప్రకృతి ఫిల్మ్ ఫెస్టివల్‌కు లఘుచిత్రం ఎంపిక



పూరి గుడిసెలో పాఠాలు నేర్చుకుంటున్న విద్యార్థులు (లఘుచిత్రంలోని దృశ్యం), రఘుపతి

స్టేషన్‌ఘన్‌పూర్, ఆగస్టు 12: యూజీసీ-సీఈసీ 16వ అంతర్జాతీయ ప్రకృతి ఫిల్మ్ ఫెస్టివల్ కోసం జరిగిన లఘుచిత్ర పోటీల్లో మండలంలోని సముద్రాల గ్రామానికి చెందిన ఓయూ ఈఎమ్మార్సీ (ఎడ్యుకేషనల్ మల్టీమీడియా రీసెర్చ్ సెంటర్) డైరెక్టర్ పి.రఘుపతి రూపొందించిన లఘుచిత్రం మొదటి స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా సోమవారం రఘుపతి మాట్లాడారు. యూజీసీ, సీఈసీ ప్రతీ ఏటా పర్యావరణం, అభివృద్ధి, మానవ హక్కులు, స్వచ్ఛభారత్ విభాగాల్లో లఘుచిత్ర పోటీలను నిర్వహిస్తుందన్నారు. తాను రూపొందించిన రీచింగ్ దీ అన్‌రీచ్డ్ లఘుచిత్రం అభివృద్ధి విభాగంలో మొదటి స్థానంను కైవసం చేసుకొని అంతర్జాతీయ పోటీలకు ఎంపికైందన్నారు. ఈ పోటీలలో ఎంపికైన లఘు చిత్రాలను ప్రతీ ఏటా నిర్వహించే ప్రకృతి అంతర్జాతీయ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ప్రదర్శించడం జరుగుతుందన్నారు. అందులో విజేతలుగా నిలిచిన వారికి ప్రశంసాపత్రం, నగదు బహుమతి అందిస్తారని తెలిపారు. జనజీవనానికి దూరంగా అటవీ ప్రాంతాల్లో నివసిస్తున్న గుత్తికోయ పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పే ఉద్దేశంతో ఓయూ జర్నలిజం విద్యార్థులు ఇస్రం సంతోష్ తన మిత్ర బృందంతో కలిసి ఏర్పాటు చేసిన ఏకోపాధ్యాయ టీం చిల్డ్రన్ హ్యాపినెస్ కేంద్రాలపై తాను లఘుచిత్రం రూపొందించానని తెలిపారు. తాను రూపొందించిన లఘుచిత్రం 16వ అంతర్జాతీయ ప్రకృతి ఫిల్మ్ ఫెస్టివల్‌కు ఎంపిక కావడం సంతోషంగా ఉందన్నారు. లఘుచిత్రం ఎంపిక పట్ల ఓయూ రిజిస్ట్రార్ లక్ష్మీనారాయణ, ఇన్‌చార్జ్ వీసీ దానకిశోర్, ఉన్నత విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం, యూజీసీ డీన్ మల్లేశం అభినందించినట్లు తెలిపారు.